క్లుప్తంగా

కంపచెట్ల తొలగింపు



కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కళ్యాణదుర్గం: 'సారూ.. కంపచెట్లు తొలగించరూ...' అన్న శీర్షిక సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ స్పందించారు. అనంతపురం– కళ్యాణదుర్గం రహదారిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా డివైడర్ల మధ్య ఉన్న కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

వాల్మీకి జయంతి శుభాకాంక్షలు



తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: ఉమ్మడి అనంత జిల్లా వాల్మీకి సోదరులకు మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య వాల్మీకి మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మంగళవారం కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ కార్యాలయం (సరోజా కాంపౌండ్)లో ఉదయం 11.30 గంటలకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. నాయకులు, కార్యకర్తలు, వాల్మీకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ప్రజా వేదికకు వెల్లువెత్తిన అర్జీలు

కూడేరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. అధికంగా భూసమస్యలపై అర్జీలు వచ్చాయి. వాటిని డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్ భాస్కర్ స్వీకరించారు. కానీ అర్జీదారులను రిజిస్టర్‌లో నమోదు చేసింది లేదు. అర్జీదారులకు రసీదు ఇచ్చింది లేదు. కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. రసీదులు ఇవ్వలేదు. అధికారులు తమ సమస్యలు ఎలా పరిష్కరిస్తారో అంటూ ప్రజలు నిరుత్సాహంతో వెళ్లడం కనిపించింది. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ హనుమప్ప, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఏపీఎం దేవానంద ఫిలిప్స్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, ఏఈఓ రాఘవేంద్ర, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సురేఖ, హార్టికల్చర్ ఎంపీఈఓ జాస్మిన్ పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట ధ్వంసం

కుందుర్పి: మండలంలోని అటవీ ప్రాంతాలకు చేరువలో ఉన్న జంబుగుంపల, బెస్తరపల్లి, ఎనుములదొడ్డి తదితర పంచాయతీల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న వేరుశనగ తదితర పంటలను అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. కెంచంపల్లి సమీపంలో రైతు తిప్పేస్వామికి చెందిన రెండు ఎకరాల మొక్కజొన్న పంటను ఆదివారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయన్నారు. సోమవారం జంబుగుంపల అటవీ బీట్ అధికారి పరమేశ్వరప్పకు ఈమేరకు ఫిర్యాదు చేశారు. అటవీ ప్రాంతాల చుట్టూ ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలని విన్నవించారు.

అంతా మా ఇష్టం



ఉదయం 11 గంటల సమయంలో సచివాలయం ముందు అధికారుల కోసం వేచివున్న ప్రజలు

కుందుర్పి: మండల పరిధిలోని జంబుగుంపల గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదు. వివిధ సమస్యలపై సోమవారం ఉదయమే కార్యాలయం వద్దకు చేరుకున్నా 11 గంటలైన ఒక్కరూ రాకపోవడంతో వెనుతిరగాల్సి వచ్చిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించకపోవడంతో ప్రజలందరూ నిత్యం ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ కమలమ్మ , సర్పంచ్ గంగాధర విమర్శించారు. పంచాయతీ కార్యదర్శి ఎక్కడ ఉంటాడో కూడా తెలియదని స్థానికులు వాపోతున్నారు.

గౌనికి అభినందనల వెల్లువ



జన్మదిన వేడుకలు జరుపుకున్న గౌని ఉపేంద్రరెడ్డి

రాయదుర్గంటౌన్: వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా నియమితులైన గౌని ఉపేంద్రరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. సోమవారం పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు గౌని ఇంటికి వచ్చి సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఇదేరోజు ఆయన జన్మదినం కావడంతో పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యుల సమక్షంలో గౌని ఉపేంద్రరెడ్డి వేడుకలు నిర్వహించారు.



బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు



బస్సు రాగానే సీట్ల కోసం ఎగబడుతున్న ప్రయాణికులు



సీటు లేకపోవడంతో ఫుట్‌పాత్‌పై కూర్చుని ప్రయాణం చేస్తున్న మహిళ

కష్టాలు ఉచితం

కళ్యాణదుర్గం: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. దసరా సెలవులు ముగియడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం కళ్యాణదుర్గం ఆర్టీసీ బస్టాండ్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బస్టాండ్ నుంచి అనంతపురం వెళ్లేందుకు బస్సులు రాగానే జనం ఎగబడ్డారు. కొందరైతే బస్సు వస్తుండగానే సీట్ల కోసం తాపత్రయపడ్డారు. ఇక కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వెళ్లే దారిలో గోళ్ల, హనిమిరెడ్డిపల్లి, కాలువపల్లి వరకూ ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉన్నారు. కళ్యాణదుర్గంలోనే బస్సులు ఫుల్ అయిపోవడంతో గ్రామాల్లో ప్రయాణికులు చేయ్యెత్తినా కూడా నిలబడకుండా పోయాయి. కొందరు మహిళలైతే బస్సులో ఫుట్‌పాత్‌పై కూర్చుని ప్రమాదకరంగా ప్రయాణం చేశారు.



కాలువపల్లిలో ప్రయాణికులు చెయ్యెత్తినా ఆగని ఆర్టీసీ బస్సు



బస్సు వెళ్లిపోయాక ఆటోలో వెళ్తున్న ప్రజలు



రాయదుర్గంలో అనంతపురం వెళ్లే బస్సులో సీట్ల కోసం ప్రయాణికుల పాట్లు

పైప్‌లైన్ లీకేజీలతో పరేషాన్



ఎంపీడీవో కార్యాలయం జమ్మిచెట్టు వద్ద ఏర్పడిన లీకేజీతో వృథాగా పోతున్న నీరు

రాయదుర్గంటౌన్: తాగునీటి పైపులైన్ తరచూ లీకేజీలు ఏర్పడుతుండటంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చెల్సీ శాశ్వత మంచినీటి పథకం ద్వారా కణేకల్లులోని ఎస్ఎస్ ట్యాంకు నుంచి రాయదుర్గం పట్టణ వాసులకు తాగునీరు సరఫరా అవుతోంది. ఎస్ఎస్ ట్యాంకులో సమృద్ధిగా నీరున్నా మూడురోజులకోసారి నీటిని వదులుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తరచూ లీకేజీల కారణంగా నీటి సమస్య మరింత జఠిలంగా మారుతోంది. తాజాగా సోమవారం పట్టణంలో బళ్లారి రోడ్డు నుంచి కేజీబీవీకి వెళ్లే దారిలో జీఎల్ఎస్ఆర్ పంపింగ్ పైప్‌లైన్‌కు, అలాగే ఎంపీడీఓ కార్యాలయం జమ్మిచెట్టు వద్ద ఇళ్లకు నీటిని సరఫరా చేసే డెలివరీ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఇవి కాక పట్టణంలోని బళ్లారి రోడ్డు పెట్రోల్ బంక్ ఎదురుగా ఒకటి, ఫైర్ స్టేషన్‌కు వెళ్లే దారిలో మూడు చోట్ల లీకేజీలు ఉన్నాయి. పట్టణంలోని ఫిల్టరేషన్ పాయింట్ వద్ద నుంచి కణేకల్లులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వరకు దాదాపు ఐదారు చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టి నీటి సరఫరాను మెరుగుపరచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికునికి అభినందనలు



అవార్డు అందుకుంటున్న పారిశుధ్య కార్మికుడు రాజు

రాయదుర్గంటౌన్: జిల్లాస్థాయిలో 'బెస్ట్ స్వచ్ఛ వారియర్'గా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్న రాయదుర్గం మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికుడు బి.రాజును కమిషనర్ దివాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ తదితరులు అభినందించారు. సోమవారం అనంతపురంలో జరిగిన స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నారు.

అధికారులతో తహసీల్దార్ సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్

బెళుగుప్ప: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో తహసీల్దార్ అనిల్‌కుమార్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో రైతులు సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ చేయాలని సూచించారు. అలాగే పీజీఆర్ఎస్, సెక్షన్–22ఏ డాటెడ్ భూములు, రీసర్వే, ఆర్డీఓ, ఆర్ఓఆర్ కేసులకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీటీ మధుసూదన్‌రావ్, రీ సర్వే డీటీ గురుబ్రహ్మం, ఆర్ఐ నగేష్ బాబు, ఏఓ పృథ్వీసాగర్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

పొలాల్లో ఫారంపాండ్లు తవ్వించుకోండి



ఇప్పేరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ కుళ్లాయి స్వామి

కూడేరు: ఉపాధి హామీ పథకం ద్వారా పొలాల్లో ఫారంపాండ్లు తవ్వించుకునేందుకు రైతులు ముందుకు రావాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి సూచించారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించేందుకు సోమవారం ఇప్పేరులో గ్రామ సభ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఫారంపాండ్ల తవ్వకాలు చేపడితే అందులో వర్షపు నీరు నిలిచి భూగర్భ జలాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పోలేరయ్య, ఇంజినీర్ రాజేష్, పంచాయతీ కార్యదర్శి పావని తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం ఇంకెన్నాళ్లు తిరగాలి?



తహసీల్దార్ కార్యాలయం వద్ద కుమారుడు విజయ్‌తో వన్నూరమ్మ

బొమ్మనహాళ్: బుద్ధిమాంద్యం కలిగిన తన కుమారుడికి పింఛన్ కోసం అర్జీలపై అర్జీలు ఇస్తున్నా మంజూరు కావడం లేదని ఉంతకల్లుకు చెందిన వన్నూరమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి బుద్ధిమాంద్యం కలిగిన కుమారుడు విజయ్‌తో కలిసి వచ్చి అర్జీ అందజేసింది. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇదివరకు ఒకే రేషన్‌కార్డులో ఉన్న వృద్ధురాలికి పింఛన్ వస్తోందని, రెండో పింఛన్ ఇవ్వలేమని చెప్పారంది. ఇటీవల ఆ వృద్ధురాలు చనిపోయిందని, ఇప్పుడైనా పింఛన్ మంజూరు చేయాలని అధికారులను వేడుకుంటున్నా ఎటువంటి పురోగతీ కనిపించలేదంది. కుమారుడి పరిస్థితి చూసైనా స్పందించాలని కోరుతోంది. పింఛన వస్తే కుమారుడికి వైద్యం–మందుల ఖర్చులకు ఉపయోగపడుతుందని తెలిపింది.

కల్వర్టును ఢీకొన్న లారీ.. డ్రైవర్ మృతి



నుజ్జు నుజ్జైన లారీ ముందుభాగం

బెళుగుప్ప: మండలంలోని బూదివర్తి గ్రామం వద్ద కల్వర్టును లారీ ఢీ కొనడంతో డ్రైవర్ బోయ శంకర్ (32) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. బూదివర్తి గ్రామానికి చెందిన బోయ శంకర్ లారీ డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. సోమవారం రాత్రి లారీలో వెళ్తుండగా గ్రామానికి సమీపంలోనే రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును వేగాన్ని అదుపు చేయలేక ఢీ కొన్నాడు. ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జైంది. వాహనంలోనే ఇరుక్కున్న డ్రైవర్‌ను అతికష్టం మీద పోలీసులు బయటకి తీశారు. 104 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఊరట

ఉరవకొండ: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణ వల్ల సామాన్య, పేద వర్గాల కు ఎంతో ఊరట కలిగిందని ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ తెలిపారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు అవగాన కల్పించారు. ఈ సందర్భంగా అర్థశాస్త్ర విభాగధిపతి అయ్యన్న వస్తువుల కొనుగోలుపై తగ్గే వడ్డీ భారం, ఉపాధి కల్పన మొదలైన అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణవేణి, ప్రభాకర్, రమేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఎస్టీ 2.0 పన్నుల తగ్గింపు.. వివిధ సేవ పన్నులపై అవగాహన అవసరమని శ్రీకాకుళం జిల్లా తుగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సత్యనారాయణ సూచించారు. స్థానిక కళ్యాణదుర్గం ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అర్థశాస్త్రం, వాణిజ్య శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్వీజీఎం ప్రిన్సిపల్ డాక్టర్ పి.హర్షలత , వైస్ ప్రిన్సిపల్ ఎంవీ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: కేంద్ర ప్రభుత్వం వివిధ వస్తువులపై జీఎస్టీ తగ్గించడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్ అన్నారు. సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయం, వెలుగు కార్యాలయాల్లో జీఎస్టీ స్లాబ్‌లను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

గుమ్మఘట్ట: తాళ్లకెర కమ్యూనిటీ హాలులో మత్స్యకారులకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. బోట్లు, ఐస్‌బాక్సులు, ఇంజిన్లపై జీఎస్టీ భారీగా తగ్గిందని ఎంపీడీఓ జయరాములు, ఎఫ్‌డీఓ ఆసిఫ్ తెలిపారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, సెక్రటరీ సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కేటీఎస్ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ అమలుపై అర్థశాస్త్ర, కామర్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపు, అమలుపై అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ సూచించారు.

టమాట రోడ్డుపాలు



బీటీపీ హౌసింగ్ లేవుట్ రోడ్డు పక్కన పారబోసిన టమాటాలు

రాయదుర్గంటౌన్: మచ్చ తెగులు టమాట నాణ్యతపై ప్రభావం చూపుతోంది. మార్కెట్లో నాణ్యత కలిగిన టమాట కిలో రూ.20 దాకా పలుకుతోంది. అయితే మచ్చ తెగులు ఆశించిన టమాటాలను మార్కెట్లో కొనేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. దీంతో చేసేది లేక రైతులు టమాటాను రోడ్డుపక్కన పారబోస్తున్నారు. సోమవారం పట్టణ శివారు హౌసింగ్ లేఅవుట్ బీటీపీ రోడ్డు పక్కన పారబోసిన టమాటాలను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంతో వైరల్‌గా మారింది.

యాజమాన్య పద్ధతులతోనే మామిడిలో దిగుబడి

కుందుర్పి: యాజమాన్య పద్ధతుల ద్వారానే మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చని సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి, ఉద్యాన సహాయ సంచాలకులు దేవానంద తదితరులు సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌బీకేలో మామిడి పంట పూత దశలో చేపట్టాల్సిన చర్యలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏపీడీ ధనుంజయ, ఏఓ విజయ్‌కుమార్ , ఉద్యానవన అధికారి గౌసియా తదితరులు ఉన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం ములకనూరులో దళితుల శ్మశాన వాటికను కొందరు కబ్జా చేస్తున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు, స్థానిక ఎస్సీ కాలనీ వాసులు ఆర్డీఓ వసంతబాబుకు ఫిర్యాదు చేశారు. సోమవారం కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. సర్వేనంబర్ 54/2లో ఉన్న శ్మశాన వాటికలో చిన్న గుడి నిర్మించి శ్మశానం లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సాకే గురుమూర్తి, ఎస్సీ,ఎస్టీ జేఏసీ కంబదూరు అధ్యక్షుడు డాబా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు

వజ్రకరూరు: ఆరు రోజుల క్రితం హంద్రీ–నీవా కాలువలో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ ఎం.రామాంజనేయులు ఈ నెల 1న ఛాయాపురం వద్ద ఉన్న హంద్రీనీవా ప్రధాన కాలువలో గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం రెండో రోజూ ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ఛాయాపురం నుంచి రాగులపాడు లిఫ్ట్ వరకూ హంద్రీ–నీవా ప్రధాన కాలువలో బోటులో తిరుగుతూ గాలించినా ఫలితం లేకపోయింది. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్‌కుమార్ ఎస్ఐ నాగస్వామి, ఏపీఎస్‌డీఆర్ఎఫ్ బృందం ఎస్ఐ మునాఫ్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, అగ్నిమాపక శాఖ జమీందార్ యుగంధర్, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా అస్రత్ వలీ

కుందుర్పి: స్థానిక జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల నూతన ప్రిన్సిపాల్‌గా అస్రత్ వలీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. విద్యాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని అస్రత్ వలీ తెలిపారు.

దాణా అందించాలని వినతి

కుందుర్పి: మండల వ్యాప్తంగా పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉందని, వెటర్నరీ సిబ్బంది స్పందించి సత్వరం పశువులకు దాణా, లేకపోతే సబ్సిడీతో పశుగ్రాసం అందించాలని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పశువైద్యాధికారి ప్రసాద్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. రైతులు వన్నూరప్ప, మారెన్న, ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కళ్యాణదుర్గం: మండల పరిధిలోని పాలవాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తెలుగు, గణితం స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందించి ఉదారతను చాటుకున్నారు. సోమవారం తెలుగు, గణితం ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, కరణం వెంకట రాఘవేంద్ర రావులు తమ సొంత ఖర్చుతో పదో తరగతి విద్యార్థులకు గణితం , తెలుగు సులభంగా అర్థమయ్యేలా రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను అందించారు. హెచ్ఎం అనంతనేని వెంకటేష్, ఉపాధ్యాయులు సనత్, విజయలక్ష్మి ఉపాధ్యాయులను అభినందించారు.

సంతాపం

ఉరవకొండ రూరల్: మండలంలోని పెద్దకొకుంట్ల గ్రామానికి చెందిన ఎర్రప్ప గారి గంగన్న సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్‌లో ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ తరఫున ఆదుకుంటామన్నారు. అలాగే పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆ గ్రామానికి వెళ్లి మృత దేహంపై పూల మాలలు వేసి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రాకెట్ల అశోక్, రాష్ట్ర ఎస్సీ సెల్ సహాయ కార్యదర్శి ఏసీ ఎర్రిస్వామి, చలమారెడ్డి, మహిళా నాయకురాలు వసంతమ్మ, ఆమిద్యాల సర్పంచ్ శ్రీరాములు, రాకెట్ల దయ్యాల నాగరాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్ల సమస్యలపై వినతి

బొమ్మనహాళ్: యానిమేటర్లు (వీఏఓ)ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీఎం గంగన్నకు యానిమేటర్లు సోమవారం వినతిపత్రం అందజేశారు. 5జీ మొబైల్స్ ఇచ్చే వరకు ఆన్‌లైన్ వర్కులు చేసేది లేదన్నారు. పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ పనిభారాన్ని తగ్గించి, కనీస వేతనాలు చెల్లించాలన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తూ, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

బొమ్మనహాళ్: మండలంలోని నిరుపేద దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూ పంపిణీ చేయాలని అంబేడ్కర్ సేన జిల్లా అధ్యక్షులు కె.సి.పవన్ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందజేశారు. పవన్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా భూములు లేని నిరుపేద దళితులను గుర్తించి ఒకో కుటుంబానికి మూడు ఎకరాల చొప్పున భూ పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాలవప్ప నరసింహ, శివ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ అడుగుజాడల్లో నడవాలి'

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని మెయిన్ బజార్‌లో గాంధీ విగ్రహం వద్ద దాతల సహకారంతో ఏర్పాటు చేసిన నిచ్చెనను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్‌కుమార్, ఎస్ఐ నాగస్వామి, సర్పంచు మోనాలిసా, సామాజికవేత్త బెంజ్‌మెన్, జేవీవీ జిల్లాకార్యదర్శి మల్లికార్జున, గ్రామపెద్దలు మన్యం ప్రకాష్, పట్టా ఖాజాపీరా, సుకుమార్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

శెట్టూరు: మండలంలోని ములకలేడుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పెద్దన్నగారి శివన్న(38) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, తాలుకా బూత్ కన్వీనర్ తిప్పేస్వామి ... శివన్న భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య అందించిన ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

వజ్రకరూరు: మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలను సోమవారం ఎంఈఓ తిమ్మప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేయాలన్నారు. విలువలతో కూడిన విద్య అందించాలని హెచ్ఎం ఫాతిమాబేగంకు సూచించారు.

'భక్తి మార్గంలో నడవాలి'

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ ఈర్ష్య, అసూయ, ద్వేషాలకు దూరంగా ఉంటూ భక్తిమార్గంలో నడవాలని వివిధ మఠాల పీఠాధిపతులు సూచించారు. సోమవారం మండలంలోని గంజికుంటలోని ఉన్న ఉమా మహేశ్వర గురుపీఠం(శ్రీప్రణవానంద ఆశ్రమం)లో రెండో రోజు ఆశ్రమ ధర్మకర్త మఠం ఉమాదేవి ఆధ్వర్యంలో శివ స్వరూపానందగిరి గురువర స్వాముల పుణ్యారాధన మహోత్సవం ఘనంగా కొనసాగించారు. వివిధ ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులు ప్రణవానందగిరిగురుస్వామి, గురుచరణానందగిరి మాతాజీ, గురుసేవానందస్వామి, శివానందమాతాజీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానికులతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.